

# మనిషి మనసు

పృథ

"అరుణగారూ మీకు ఫోన్" అటెండర్ రొచ్చి చెప్పి వెళ్ళిపోయాడు.

ఆఫీసుకొచ్చి ఒక గంటన్నా కాలేదు. తనకి ఫోన్ ఎవరు చేసిఉంటారు. తను వచ్చేసరికి ఇంట్లో అందరూ బాగానే వున్నారే' భయంతో, సందేహంతో దడ దడలాడే గుండెతో ఫోను దగ్గరికి వచ్చింది అరుణ.

"మీ ఇంట్లో ఎవరికైనా సుస్తీగా వుందా?" పక్కసీటులోని కమలాక్షి అడిగింది. మౌనంగా తల వూపి ఫోనెత్తి "హలో" అంది కీచుగొంతుతో. 'అవ తలనుంచి మాట్లాడేది ఎవరు?' అని వినిపించిందామెకు.

"నేను అరుణను మాట్లాడుతున్నాను మీరు—" సందేహంగా ఆగింది.

"నా పేరు రాజశేఖర్. నన్ను గుర్తు పట్టేరా?"

ఆ పేరు వింటూనే అరుణ ముఖం లోకి సిగ్గు తొంగిచూసింది "మీరా"

అంది బిడియంతో తడబడుతూ.

"అవును నేనే, గుర్తుపట్టేరన్నమాట మీకు అభ్యంతరం లేకపోతే మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి వీలవుతుందా?" అతని గొంతులో అభ్యర్థన తొంగిచూసింది.

"నాతో మాట్లాడకూడదా? నాకన్న మా వాళ్ళతో మాట్లాడితేనే బాగుంటుందేమో" గొంతు పెగుల్చుకొని.

"మీవాళ్ళతో మాట్లాడే విషయం కాదు. అది మీతోనే చెప్పాలి, ఎక్కడ కలుసుకుందామో చెప్పండి. ఇందుకు అభ్యంతరమైతే ఫ్రాంక్‌గా ఆ విషయం చెప్పేయండి. నేనేమీ అనుకోను."

"ఎక్కడ కలుసుకుందామో మీరే చెప్పండి."

"నెహ్రూపార్కులో సాయంత్రం ఆరుగంటలకు కలుసుకుందాము."

"ఆల్‌రైట్."

"థాంక్యూ!"

తన సీట్లోకొచ్చి కూర్చుంది అరుణ. ఆమెకు పనిమీదకుపోవడంలేదు. ఫోన్ చేసిన వ్యక్తే గుర్తువస్తున్నాడు పదే, పదే.

"ఫోన్ చేసింది ఎవరు?" మళ్ళీ అడిగింది కమలాక్షి కుతూహలంగా.

"మా మామయ్యగా రబ్బాయి" అబద్ధాన్ని ఆశ్రయించక తప్పలేదు. అతనెవరో చెప్తే 'ఎందుకు చేశాడు, ఏం చెప్తాడట?' ఇన్ని అడుగుతుంది. అందుకే నోటికొచ్చిన మాట చెప్పింది.

అబ్బాయి అంది కాబట్టి ఏ పదిపన్నెండేళ్ళ అబ్బాయో అనుకుందేమో కమలాక్షి మళ్ళీ మాట్లాడలేదు. తన పని చేసుకోసాగింది.

ఒక ఫైలు తీసింది అరుణ కాని ఆమె మనసులో ఎన్నో దృశ్యాలు తిరుగుతున్నాయి.

నాలుగు రోజులక్రితం తనని చూసుకోవడానికి వచ్చారు. తనకప్పుడే పెళ్ళి చేసుకోవాలని లేదు. ఆ మాట పెద్ద వాళ్ళతో చెప్తే "చూసిన సంబంధం వెంటనే కుదిరిపోతుం దేమిటి? మీ అక్కకు ఇరవై సంబంధాలు చూసాము. ఇరవై ఒకటో సంబంధం కుదిరింది అలాగే నీ కూడా ఇప్పటినుంచి చూస్తుంటే మళ్ళీ సంవత్సరానికైనా నీ పెళ్ళి చేయగలుగుతానేమో" అన్నాడు తండ్రి. కాస్త సరదాగానూ, మరికాస్త దిగులుగానూ. అందంగా వున్న అక్కయ్యకే అన్ని సంబంధాలు చూసినప్పుడు కాస్త నలుపుగా వున్న తనకి ఇంకెన్ని చూడాలో' అని దిగులుపడుతూనే పెళ్ళి చూపులకు సిద్ధమయ్యింది. అసలు తనని చదివించడంలో, ఉద్యోగం చేయించడంలో ఒక ఉద్దేశ్యం వుంది తండ్రికి. పెళ్ళి చేయలేకపోయినా ఉద్యోగం అయినా ఉంటే పెళ్ళి కాలేదే అనే దిగులు లేకుండా ఆడపిల్లకు ఆదొక వ్యాపకంగా వుంటుంది ఉద్యోగం'

అన్నదీను.

అబ్బాయితోపాటు మరో ముగ్గురు వచ్చారు పెళ్ళి చూపులకు. అతని తల్లి తండ్రి, చెల్లెలూనూ. తల్లి ఒకటి రెండు ప్రశ్నలు అడిగి వూరుకుంది. 'వంట చెయటంవొచ్చా, కుట్లు అల్లికలూవచ్చా, పెళ్ళయ్యేవరకేం చేస్తావా ఉద్యోగం, ఆ తరువాతకూడ చేస్తావా"? అని.

వంటవచ్చని చెప్పింది. కుట్లు, అల్లికలంటే ఇంటరెస్టు లేదన్నది. ఉద్యోగం చేసుకున్న వ్యక్తి ఇష్టాన్ని బట్టి వుంటుంది చేసేది, మానేదేను" ఆ మాటే చెప్పింది బిడియంగా.

"చదువుకున్న వాళ్ళు కూడా సిగ్గు పడతారా" అని నవ్వింది చెల్లెలు చనువుగా.

"చదువుకి సిగ్గుకి సంబంధం ఏముంది? బిడియపడటం ఆడ లక్షణం అని" నవ్వింది తను.

"మీకు పాటలు వచ్చా? మీ ఆఫీసులో ఎంత మంది లేడిస్ పనిచేస్తున్నారు? సినిమాలు చూస్తారా? నాకైతే ప్రతి విడుదలైన సినిమా చూడాలనిపిస్తుంది కాని మావాళ్ళు పంపించరు. మా అన్నయ్యకు పెళ్ళయితే మా వదినా నేను గప్ చుప్‌గా వెళ్ళిపోతాము సినిమాకి. వదిన తోడు వుంటుంది కొబట్టి అమ్మా నాన్న ఏమీ అనరు? పుస్తకాలు చదువుతా. ఏ రచయితంటే ఇష్టం మీకు నాకై తే మల్లాది రచన, మాదిరెడ్డి సులోచనవి ఇష్టం, పాపం మాదిరెడ్డి పోయారు కదా ఆవిడవుంటే మరిన్ని కథలు రాసేవారు. మంచివాళ్ళే పోతారు ఎందుకనో వస పోసిన పిట్టలా గలగల ఒకటే కబుర్లు చెప్పి అదరకొట్టేసింది తనని. వాళ్ళ మాటల్నిబట్టి చూస్తే తను వాళ్ళకి నచ్చినట్లే కనిపించారు అతని పేరు రాజశేఖర్ అని విన్నప్పుడే అతనిలాగే పేరు కూడ బాగుంది అనుకుంది. అతను తనకి బాగా నచ్చాడు. ఈ నంబంధం రైటవుతే బాగుండును అని చాల కోరుకుంది మనసులో. కాని తను అతనికి నచ్చుతుందా? అనుకుంటే నచ్చక పోవచ్చు అనే అనిపించింది ఎందుకంటే అతని ప్రక్కన తనని నిలబెడితే అతను బంగారు బొమ్మలాగ, తను మకిలిపట్టిన ఇత్తడి బొమ్మలాగ కనిపిస్తారు చూసే వాళ్ళకి. అందుకే అతని మీదను యిష్టం కలిగినా ఆశపెంచుకోలేదు.

ఇంటికెళ్ళి కబురు చేస్తామన్నారు వాళ్ళు. వాళ్ళ దగ్గరనుంచి ఆ మర్నాడు కబురు వస్తుందేమోనని చూసారు ఇంట్లో అందరూ అమర్నాడు ఇంకో మర్నాడు కూడ రాలేదు కబురు. బహుశా మన సంబంధం వాళ్ళ అబ్బాయికి నచ్చలేదేమో తండ్రి తల్లి దగ్గర అనడం వింది. ఊహించే విషయమే కనుక తను బాధపడలేదు. అప్పుడే నాలుగు రోజులు ఆ విషయం మర్చిపోయింది తను కాని ఇప్పుడు అతను ఫోన్ చేసాడంటే అదీ

"మీతో మాట్లాడాలి" అని చెప్పడంలో అంతరార్థం ఏమిటి అన్నదే అర్థం చేసుకోలేకపోతున్నది అరుణ.

"మీరు నాకు నచ్చారు" అని చెప్పడం కోసమా లేక "నాకు మరో సంబంధం కుదిరింది సారీ" అని విచారం వ్యక్తం చేయడానికా?

"సాయంత్రం ఆరు గంటలకి ఎలాగూ తెలుస్తుంది కదా. పండో, పచ్చో, అంతవరకు ఆగు" అని ఓదార్చింది అంతరాత్మ.

మనసులోని ఆరాటంవల్ల టైమే గడవడంలేదు అరుణకు, గడియారం అతి నెమ్మదిగా తిరుగుతున్నట్లు, కాలం స్థంబించిపోయినట్లుగా వుందామెకు.

ఆఫీసు గడియారం అయిదు గంటలు కొట్టింది "అమ్మయ్య" అనుకుంటూ సీట్లోంచి లేచింది అరుణ.

"మా అబ్బాయికి రేపు బర్త్‌డే. డ్రస్ కొనాలి షాపింగ్ చేద్దాము రావా" అని పిలిచింది కమలాక్షి ఇప్పుడు కాదంటే సవాలక్ష ప్రశ్నలు వేసి చంపుతుందని మారుమాట చెప్పకుండా ఆమె వెంట రెడీమేడ్ షాపుకి బైలుదేరింది అరుణ.

కొనేది ఓ చొక్కా లాగు కోసం కొట్టంతా తిరగేసి బోర్లేసి నానాహంగామా చేసి ఓ జత తీసింది. చాక్‌లెట్లు. ఇంకా పళ్ళు అవీ ఇవీ తీసుకుని టాటా చెప్పి వెళ్ళిపోయిందామె.

టైము చూసుకుంది అరుణ పావు తక్కువ ఆరు. బస్సుకోసం చూస్తే అక్కడికి చేరుకోవడం కష్టం అని ఆటో మాట్లాడుకుని నెహ్రూపార్కు చేరుకుంది. గేటు దగ్గరే స్కూటరుకి స్టాండ్ వేసి తనకోసమే చూస్తూ కనిపించాడతను.

వచ్చారా అన్నట్లు చూసాడతను ఆమెవైపు. ఆ చూపుల్ని మరోలా భావించుకున్న అరుణ గుండె ఝల్లుమంది మధురోహలతో, కాళ్ళు కంపిస్తుండగా అతని దగ్గరగా నడిచింది.

"రారేమో అనుకున్నాను. మరి కాస్సేపు చూసి వెళ్ళిపోదామనుకుంటుండగా వచ్చారు. నా మాటకి విలువనిచ్చి వచ్చినందుకు ధన్యావాదాలు" అందంగా నవ్వేడతను. ఎర్రని పెదవుల మధ్యనించి తెల్లని పలువరుస తళుక్కుమన్నట్లుగా మెరిసింది. మనిషిలాగే నవ్వుకూడా అందంగావుంది మనసులోనే అతని నవ్వుని మెచ్చుకుంది అరుణ. తనను రమ్మనుమని ఏం చెప్తాడా అనే ఆసక్తితో అతనివైపు చూసింది.

"నేను చెప్పేది మీకు అప్రియంగా వుండవచ్చు బాధకలిగించవచ్చు" నెమ్మదిగా రంగంలోకి దిగాడతను.

"ఫరవాలేదు ఏది చెప్పినా వినడానికి నేను సిద్ధంగావున్నాను" మనస్ఫూర్తిగా చెప్పింది.

"మన పెళ్ళి జరగడం నా కిష్టంలేదు"



మనసులో మాట చెప్పి ఆమెవైపు భయంగా చూడసాగాడు. ఏమంటుందో? ఈమాట చెప్పడానికే ఇంత దూరం రప్పించాలా? ఫోన్‌లో చెప్తే సరిపోయేది కదా. మీ పెద్దవాళ్ళతో కబురు చేసినా సరిపోతుంది కదా అని కేకలేస్తుందేమో, రోషపడుతుందేమో అనుకుంటూ. అతనూహించినట్లుగా అరుణ ఉద్రేకపడలేదు. కోపంతో దిగులూపడలేదు "నాకు తెలుసు నేను మీకు నచ్చనని, మీ అందానికి సరియైనజోడు కానని" అంది తలవంచి తగ్గు స్వరంతో. ఆమె నిజాయితీకి అతను ముగ్ధుడయ్యాడు. ఆశ్చర్యపడ్డాడు "క్షమించండి. పిలిచి మిమ్మల్ని ఇన్‌సల్ట్ చేసినట్లుగా వుంది నా ప్రవర్తన" పశ్చాత్తాపపడుతున్నట్లుగా చూసేడు. "మీరు అందంగా లేరనికాదు. నాకు నచ్చనిది, నా కిప్పట్లో పెళ్ళిచేసు

కోవాలని లేదు. ఆ మాటే వాళ్ళతో చెప్తే వాళ్ళు విన్నారు కాదు. పిల్లని చూట్టాని కెళ్ళడం. చూసి వచ్చాక నచ్చలేదని చెప్పడం ఇదంతా నాకు గిల్టీగా వుంటుంది. అందుకే రానంటే రానని పట్టుబట్టాను. 'నీ కిష్టంలేకపోతే బలవంతం చేయం. పిల్ల నచ్చితేనే చేసుకుందువుగాని' అని పట్టుబట్టి లాక్కొచ్చారు. నా మనసులో మాట మీకు చెప్పాలని ఈ నాలుగు రోజులనుంచీ ప్రయత్నిస్తుంటే ఈరోజు దొరికింది ఆ అవకాశం. ఇలా చెప్తున్నందుకు నన్ను చెడ్డవాడని అనుకోవద్దని మనవి" అతను చేతులు జోడించి నమ్రతగా అంటుంటే అరుణకు నవ్వాగింది కాదు. ఫక్కున నవ్వుతూ అంతలోనే సిగ్గుపడిపోయింది.

"నా మీద కోపంలేదు కదూ మీకు" రెట్టించాడతను.

"కోపమా ఎందుకు? ఉన్న మాట చెప్పినందుకు సంతోషించాలి కాని ఎంతో అందమైన భార్య మీకు తప్పకుండా దొరకాలని కోరుతున్నాను. మనం మంచి స్నేహితుల్లా వుండాలని, నా కోరిక ఏమంటారు."

"తప్పకుండా అలాగే వుందాము. నమస్తే" అతను చేతులు జోడించి అప్పుడు స్కూటర్ స్టార్ట్ చేసాడు.

"మీరు మా ఇంటికి కూడా రావాలి, ఫ్రెండ్లీగా" తను కూడ చేతులు జోడిస్తూ అంది అరుణ.

"తప్పకుండా వస్తాను." అతను వెళ్ళిపోయాడు అతను కనుమరుగయ్యే వరకూ చూసి అప్పుడు వెనక్కి తిరిగింది అరుణ.

* *

అరుణకు మాటిచ్చిన ప్రకారం అప్పుడప్పుడూ వాళ్ళ ఇంటికి వెళ్తున్నాడు రాజశేఖరమ్.

అరుణ తల్లి, తండ్రి కూడ అతనితో స్నేహంగానే మాట్లాడేవారు. 'వాళ్ళిద్దరికీ జత కూర్చలేదు ఆ భగవంతుడు' అని రాజీపడ్డారు మనసులో.

మరో రెండు నెలలు గడిచిపోయాయి. అరుణ అక్క వచ్చింది. ఆమెవెంట ఆమె ఆడబడుచుకూడా వచ్చింది. ఆ అమ్మాయి బియ్యే పరీక్షలు రాసింది. రిజల్ట్సు తెలిసే వరకు ఖాళీగానేవుండాలి కదా అని వదిన గారి వెంట బైలుదేరి వచ్చింది. ఆ అమ్మాయి రాకలో మరో అంతరార్థం వుంది. పనిలో పనిగా ఏదైనా సంబంధం వుంటే పిల్లని చూపెట్టి వాళ్ళకి నచ్చితే మాకు తెలియజేస్తే మేమొచ్చి అన్ని మాట్లాడుకుని సెటిల్ చేసుకుంటాము అని చెప్పేరు మామగారు. ఆ విషయం రాగానే తండ్రితో చెప్పి ఎరికలో మంచి సంబంధం వుంటే చూడు నాన్నా అందామె. కూతురు సంబంధం అన్నప్పుడు ఆయనకు రాజశేఖరమ్ గుర్తు వచ్చాడు. అతనిలాగే ఈ అమ్మాయి చాలా అందంగా వుందికనుక అతనికి ఈ

అమ్మాయి నచ్చవచ్చు అనుకున్నాడు. ఆ మరునాడు ఆదివారం రాజశేఖర్ వచ్చాడు. ఆ కబురు ఈ కబురు అయ్యాక మా పెద్దమ్మాయి అడపడుచు టియ్యే చదివింది. అంటూ అతనికి పరిచయం చేసారు, ఆ అమ్మాయి సిగ్గుపడకుండా ఫ్రీగా మాట్లాడింది. నేడు విడుదలౌతున్న సినిమాల గురించి పత్రికల్లోవచ్చే సెక్స్ సాహిత్యం, రాజకీయాల గురించి చాలా సేపు చర్చించుకున్నారు. అందరూ కలిసి. ఆ తరువాత అతడు వెళ్ళిపోయాడు. ఆ మర్నాడు అతను వస్తే అసలు విషయం కదిపేరు అరుణ నాన్నగారు. "అమ్మాయి ఎలావుంది? మీకు నచ్చిందా? వాళ్ళు కట్నంకూడ బాగా ఇస్తారు, నీవు ఏ సంగతీ చెప్తే మీ పెద్దవాళ్ళతో సంప్రదిస్తాము' అంటూ,

"అమ్మాయేమిటి? నచ్చడం ఎవరికి" ఆశ్చర్యంతో ఎదురుప్రశ్న వేసాడతను,

"నిన్న మీరుచూసిన అమ్మాయి గురించి అడుగుతున్నారు మా నాన్నగారు అలా చూస్తారేం! నచ్చిందీ, లేనిదీ చెప్పడానికి అంతసేపు ఆలోచిస్తారేం శేఖర్‌గారూ" నవ్వుతూ చూసింది అరుణ అతని ముఖం క్షణంలో రంగు మారింది. ఏదో చెప్పబోయాడు అతని మాటకి అడ్డువస్తూ "నాకు తెలుసు, మీనా మీకు తప్పకుండా నచ్చుతుంది, ఎందుకు నచ్చదూ! తను కూడ మీలాగే అందగా వుంటుంది. మీరిద్దరూ తల్చుంటే ఒకరికొకరు. జోడి సరిగ్గా సరిపోతుంది." అంది అమాయకంగా నవ్వుతూ.

"మీకు నచ్చినట్లే కదూ మా పెద్దమ్మాయి మామగారిని పిలిపించమంటారా" అరుణ తల్లి అంటూ వచ్చింది.

వాళ్ళ మంచితనానికి, ఈర్ష్య అసూయలుతేని వాళ్ళ స్వచ్ఛమైన మనసులను చూస్తుంటే అతనికెంతో బాధగా వుంది. ఇంత మంచి హృదయాలుగల వీళ్ళని దూరంచేసుకోనా? అతను అరుణవైపు చూసాడు, ఏం చెప్తాడా అన్నట్లు ఆతృతగా చూస్తున్నది తనవైపు. ఈమెదెంత నిర్మలమైన మనసో, తనని వద్దన్నాననే బాధకూడ లేకుండా మరో యువతిని చేసుకోమని 'మీ అందానికి పరిపోతుంది' అని ప్రోత్సహిస్తున్నదంటే ఈమె అమాయకత్వానికి జాలిపడనా, ఇంత మంచి మనసుగల ఈమెను ఎందుకు తిరస్కరించాను! అని నా తెలివితక్కువకి బాధపడనా?

"ఏంవిటోయ్ పిల్ల నచ్చిందా అంటే మాట్లాడవేం? మీ నాన్నగారికి ఫోన్ చేయమంటావా?"

"చేయండి నాన్నగారూ" అరుణ ప్రెస్ చేసింది

"అయామ్ సారీ, పిల్ల నచ్చలేదు

అంకుల్" మామూలుగా జవాబిచ్చాడు రాజశేఖర్.

"అరే. అదెప్పటినుంచి." ఆశ్చర్యంగా చూపింది అరుణ

"ఏది" చుట్టూ ఖంగారుగా చూసుకున్నాడు రాజశేఖర్

"మా నాన్నగారిని 'అంకుల్' అని పిలిచారు కదూ మీరు?"

"అవును ఏం? అలా పిలువకూడదా?" అడిగాడు బెరుకుగా

"ఛ.. అదికాదు నా సందేహం. ఇదివరకంతా 'సార్' అని పిలిచేవారు కదా ఒక్కసారిగా వరస కలిపేసరికి" మాట ముగించకుండా వూరుకుంది అరుణ.

"దాని మాటలకేమిలే బాబూ నీకెలా యిష్టమో అలాగే పిలు నన్నడిగితే 'సార్' అని పిలిచే పిలుపుకన్న వరుస పెట్టి పిలిస్తేనే దగ్గరివాళ్ళం అనే అభిమానం కలుగుతుంది" అన్నారు అరుణ అమ్మగారు.

"అంత అందంగా వున్న అమ్మాయి కూడా నచ్చలేదా నీకు. అయితే చాలా కష్టమోయ్ నీకు పెళ్ళికావడం" హాస్యంగా అంటూ నవ్వేసారు అరుణ ఫాదర్

"ఆ అమ్మాయి నచ్చలేదన్నాను కాని పెళ్ళి చేసుకోను అని శపథం చేయలేదు అంకుల్. మీరు మన్నిస్తానంటే మిమ్మల్ని నా మామగారిగా చేసుకోవాలని మీ అల్లుడుగా మీ అభిమానం. వాత్సల్యం నాకే లభించాలని కోరుకుంటున్నాను. ఆ వరం ప్రసాదించండి చాలు" అన్నాడు రాజశేఖరమ్ కాస్త నాటకీయంగాను, నిజాయతీగానూ.

"నువ్వు నువ్వు—చెప్పింది నిజమేనా శేఖర్" అరుణ నాన్నగారు నమ్మలేనట్లు చూసారు అతని వైపు

"నిజం అంకుల్. ఇన్నాళ్ళూ నా మనసేంవిటో నేనే తెలుసుకోలేక పోయాను. అందం అంటే ఏంవిటో మీ ఇంట్లోవాళ్ళ స్వచ్ఛమైన మనసులు చూసాక తెలిసివచ్చింది. బాహ్య సౌందర్యం కన్న ఆంతర్ సౌందర్యమే ఎన్నోరెట్లు మంచిదని" అతడు చెప్పడం ఆపి అరుణ వైపుచూసాడు. అంత వరకూ తన వైపే చూసి, తను చూడగానే ముఖం దించుకుందని గ్రహించి రాజశేఖర్ నవ్వుకున్నాడు సంతోషంగా

"పెళ్ళికూతురు మారిందన్న మాట"

ఆ ప్రక్కనే నిల్చుని వాళ్ళ మాటలన్నీ విన్న మీనా. గంటు పెట్టుకున్న ముఖంతో విసురుగా వెళ్ళిపోయింది లోపలికి.